ముగిసిన బ్రహ్మోత్సవాలు



ఉత్సవ విగ్రహాలకు పంచామృత అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

జగద్గిరిగుట్ట: చింతల్ పద్మానగర్ ఫేజ్–1లోని శ్రీదేవి భూదేవి సహిత శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఉదయం 7 గంటలకు స్వామి వారికి చుతుస్తాన అర్చన, యాగశాల బలి హరణ, శ్రీ చక్రస్నానం, స్వామి అమ్మవార్లకు పంచామృతాభిషేకం, అనంతరం ధ్వజ అవరోహణ, సప్తవరణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభించిన శివలీల తదితరులు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎన్‌క్లేవ్ ప్రధాన గేటు వద్ద బాటసారులకు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆదివారం సాయిబాబా చిత్రపటానికి పూజలు చేసి అనంతరం చలివేంద్రాన్ని ప్రారంభించారు. కాలనీకి చెందిన జె.శివలీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రానికి వైష్ణవి కాలనీకి చెందిన పలువురు చేయూత అందించారు. వేసవి కాలం పూర్తయ్యే వరకు ఈ చలివేంద్రం కొనసాగుతుందని.. ప్రతిరోజు నీళ్లతో పాటు మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు శివలీల పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం...

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూల్‌లో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం మూసాపేటలోని అభినందన్ గ్రాండ్ హోటల్‌లో సమావేశమయ్యారు. 2007–2008 సంవత్సరం పదవ తరగతి చదివిన వీరు ఆనాటి ఉపాధ్యాయులతో కలిసి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమ విద్యార్థులు ఇంకా మంచి స్థాయికి చేరుకొని, కుటుంబంతో సంతోషంగా ఉండాలని ఉపాధ్యాయులు దీవించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులకు మొక్కలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్, వైస్ చైర్మన్ అనిత, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, ప్రసాద్, సంతోష్, శాలిని, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

దుండిగల్: చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దుండిగల్ మున్సిపల్ పరిధి దీపోచంపల్లి చెరువులో ఆదివారం ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటికి తీశారు. అయితే శరీరం పూర్తిగా ఉబ్బిపోవడంతో గుర్తు పట్టలేకుండా ఉంది. మృతుడి వయస్సు 35 ఏళ్లు ఉండొచ్చని పోలీసులు పేర్కొన్నారు. ఎవరైనా హత్య చేసి చెరువులో పడేశారా.. ఆత్మహత్యకు పాల్పడ్డాడా లేక ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడా అన్న కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

నేడు రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తుల స్వీకరణ

మూసాపేట: మూసాపేట సర్కిల్ పరిధిలో రాజీవ్ యువ వికాసం పథకానికి సోమవారం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ప్రభుత్వ సెలవుగా ప్రకటించినా ఆయా డివిజన్లలోని కేంద్రాల వద్ద రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఇప్పటి వరకు మూసాపేట సర్కిల్ పరిధిలో సుమారు 1006 దరఖాస్తులు అందియని వారు వివరించారు.

ఉచిత యోగా శిక్షణా శిబిరం ప్రారంభం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని హైదర్‌నగర్ డివిజన్ ఆదిత్యనగర్ కమిటి హాల్‌లో ఆదివారం భారతీయ యోగా సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణా శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. ఉదయం 5.30 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు యోగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీవా గురుకులం, సమతానగర్ ప్రిన్సిపాల్ కె. ఉమావతి, అతిథులు డా. శేషగిరిరావు, ఆదిత్య నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె. వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కె. రాంబాబు, భారతీయ యోగా సంస్థాన్ సెక్రటరి కె. జ్యోతి, సెంటర్ ఇన్‌చార్జి డి. వసుంధరా దేవి తదితరులు పాల్గొన్నారు.

కైసర్‌నగర్‌లో పైపులైన్‌కు ఏర్పడ్డ లీకేజీలు..





గోదావరి జలాలు..డ్రైనేజీ పాలు

● తాగునీటి పైపులైన్లకు లీకేజీ.. ● వృథాగా పోతున్న నీరు ● చోద్యం చూస్తున్న జలమండలి అధికారులు..

రంగారెడ్డినగర్: గోదావరి పైపులైన్ పనుల్లో నాణ్యతా లోపం కారణంగా పలు చోట్ల తరచూ లీకేజీలు తలెత్తుతున్నాయి. పనుల నిర్వహణ సమయంలో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించి నిర్దేశించిన లోతులో పైపులు వేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో పలు ప్రాంతాల్లో తరచూ లీకేజీలు ఏర్పడుతూ నీరు వృథాగా పోతోంది. ఉషోదయ సెక్షన్ పరిధిలోని గాజులరామారం కై సర్‌నగర్ మీదుగా డబుల్‌బెడ్‌రూమ్ సముదాయానికి, అక్కడి నుండి బాచుపల్లిలోని కొంత భాగానికి 300 ఎంఎం డయా తాగునీటి పైపులైన్ వేసి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే పైపులైన్‌ను తక్కువ లోతులో వేయడంతో భారీ వాహనాల రాకపోకల కారణంగా తరచూ పైపులు పగిలి లీకేజీలు ఏర్పడుతున్నాయి. కైసర్ నగర్ డబుల్‌బెడ్‌రూమ్ సముదాయానికి ముందు, దాటిన తర్వాత రెండు చోట్ల పైపులు ధ్వంసం కావడంతో గత కొద్ది రోజులుగా నీరు ఏరులై పారుతోంది. ఈ నీరంతా డబుల్ బెడ్‌రూమ్ సముదాయం ముందు, పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో చేరి మడుగును తలపిస్తోంది.



డబుల్ బెడ్‌రూమ్ సముదాయం ఎదుట నీటి కుంటను తలపిస్తున్న దృశ్యం

లీకేజీలను గుర్తించడంలో విఫలం..

త్యం ఆయా సెక్షన్ల పరిధిలో లీకేజీలు, తాగునీటి సమస్యలను పరిశీలించాల్సిన సంబంధిత అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితమవుతున్నారు. దీంతో కిందిస్థాయి సిబ్బంది ఆడిందే ఆటగా.. పాడిందే పాటగా మారుతోంది. రోజు విడిచి రోజు గోదావరి జలాలను విడుదల చేసే సిబ్బంది లీకేజీని పట్టించుకోకుండా యథావిధిగా నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో వందలాది కిలోమీటర్ల నుంచి నగర వాసుల దాహార్తిని తీర్చడానికి తీసుకువచ్చిన తాగునీరు వృథాగా రోడ్డు పాలవుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు చెబుతునకన జలమండలి అధికారులు లీకేజీ సమస్యలను పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ ఉద్యోగులు, కార్మికులకు అండగా ఉంటా

ఆల్విన్‌కాలనీ: ప్రైవేట్ ఉద్యోగులు, కార్మికులకు అండగా ఉంటానని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. ఆదివారం ఆయన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, సంఘం వ్యవస్థాపకులు గంధం రాములుతో కలిసి వివేకానందనగర్ కాలనీలో తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న ప్రైవేట్ ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం కోసం గత 15 ఏళ్లుగా కృషి చేస్తున్న తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం రాష్ట్ర కమిటీ 2025 డైరీని ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, ప్రైవేట్ టీచర్లు, ఐటి ఉద్యోగులకు అన్ని విధాల అండగా ఉంటామన్నారు. వారికి ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సంఘం ఐటీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు కట్ట రవికుమార్ గుప్త, మీడియా విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర యాకయ్య, ప్రైవేట్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు పి.వై. రమేష్, మున్సిపల్ కార్మికుల విభాగం అధ్యక్షులు గ్యార శ్రీనివాస్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు శ్రావణి రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పుష్ప మన్యం, నాయకులు సంజీవరెడ్డి, నాయినేని చంద్రకాంత రావు, అంబాల మహేష్ కుమార్ గౌడ్, విఠల్‌ముదిరాజ్, లింగయ్య, రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ ముదిరాజ్, ఆనందరావు, అంజలి తదితరులు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరించిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తదితరులు

అన్నదానం మహాదానం



అన్నదానం చేస్తున్న మస్తాన్ రెడ్డి, తదితరులు

మోతీనగర్: ఆకలితో అలమటిస్తున్న అభాగ్యులు, అనాథలకు పట్టెడన్నం పెట్టడంతోనే జీవితానికి సంతృప్తి లభిస్తుందని వీటీం వ్యవస్థాపక అధ్యక్షుడు దేవరెంటి మస్తాన్ రెడ్డి అన్నారు. ఆదివారం విటీం జాయింట్ సెక్రటరి రాగోలు సత్యనారాయణ కుమారుడు తనవ్ పుట్టిన రోజు సందర్భంగా బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆసుపత్రిలో రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మస్తాన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సంపాదించిన దానిలో కొంతైనా పేదల కోసం వెచ్చించాలన్నారు. కార్యక్రమంలో వీటీం కోశాధికారి ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రినేటల్ కేర్ అవసరం

సాక్షి, సిటీబ్యూరో: తల్లి గర్భంలో ఉండగానే పిండం ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుందుకు అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలంగాణ వైద్యారోగ్యశాఖ కార్యదర్శి క్రిష్టినా అన్నారు. ఆదివారం కూకట్‌పల్లిలోని వివేరా ఫీటల్ మెడిసిన్ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజ ప్రయోజనాల కోసం సాధ్యమైనంత ఉత్తమమైన ప్రినేటల్ కేర్‌ను అందించాల్సిన అవసరం ఉందన్నారు. వైద్య శాస్త్రంలో ఫీటల్ మెడిసిన్ అనేది కొత్త విభాగమని, పిండ దశలోనే అనారోగ్య సమస్యలను పరిశీలించి, చికిత్సలు చేయడానికి వీలుంటుందని వివరించారు. ఆరోగ్యకరమైన శిశువుకు జన్మనివ్వడానికి ఫీటల్ మెడిసిన్ ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు చిన్మయి రాథె, ప్రన్షితరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్రెస్మా జిల్లా ప్రధాన కార్యదర్శిగా బిర్రు ఆంజనేయులు



బిర్రు ఆంజనేయులు

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం(ట్రెస్మా) మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బిర్రు ఆంజనేయులు ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎం.రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్‌రెడ్డి, అసోసియేటెడ్ అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షులు చింతల మల్లేష్, గోనె హనుమంత్ రెడ్డి, రామనరసయ్య, అధికార ప్రతినిధి రామచందర్ తదితరులు ఎన్నికలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. కుత్బుల్లాపూర్ అసోసియేషన్ చైర్మన్ వెంకటేష్, అధ్యక్షుడు వినోద్ జాదవ్, ప్రధాన కార్యదర్శి దయాకర్, కోశాధికారి శ్రీశైలం, వేద పాఠశాల కరస్పాండెంట్లు జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఆంజనేయులుకు అభినందనలు తెలిపారు.

ఎన్నికలను బహిష్కరించిన క్యూఎమ్ఆర్ఎస్ఎంఏ

రాష్ట్ర అధ్యక్షుడు ఏక పక్షంగా తన అనుచరులకు పదవులు కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని కుత్బుల్లాపూర్ మండల రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (క్యూఎమ్ఆర్ఎస్ఎంఏ) ఆరోపించింది. ఎన్నికలు నిర్వహించిన తీరును గర్హిస్తూ ఎన్నికలను బహిష్కరించినట్లు క్యూంఆర్ఎస్ఎంఏ ప్రతినిధులు పేర్కొన్నారు.

వక్ఫ్ చట్టాన్ని ఉపసంహరించాలి

జగద్గిరిగుట్ట: కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వక్ఫ్ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్రీయ దళిత సేన మైనార్టీ జాతీయ అధ్యక్షుడు సయ్యద్ జహంగీర్ హుస్సేన్ అన్నారు. ఈ మేరకు ఆదివారం జగద్గిరిగుట్టలో ముస్లిం మైనార్టీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ విధానాలకు అనుకూలంగా వ్యవహరిస్తూ దేశంలో ఇతర మైనార్టీ మతాలపై దాడి చేస్తోందన్నారు. వక్ఫ్‌బోర్డు భూములను స్వాధీనం చేసుకోవాలని యత్నిస్తోందని, దీనిని ముస్లింలు వ్యతిరేకించాలన్నారు. వక్ఫ్‌బోర్డు చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గూడ ఐలయ్యగౌడ్, ఓబీసీ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం. జనార్దన్, మైనార్టీ నాయకులు అక్బర్, హుస్సేన్, సయ్యద్, అన్వర్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్‌లో ప్లేస్‌మెంట్ డ్రైవ్

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీలో యూనివర్సిటీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె. సురేష్ బాబు ఆధ్వర్యంలో పలు కోర్ కంపెనీల్లో ఉద్యోగ కల్పనలో భాగంగా ఆదివారం రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ టెక్నికల్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. కోర్ కంపెనీల నియామకానికి ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. ఈఈఈ ఎంటెక్ విద్యార్థులైన తిరుక్కోవళ్లూరు హర్ష, జోరుసిరి చందన అనే విద్యార్థులు ఎల్ అండ్‌టీ, టిటాఘర్ ఫైర్మ కంపెనీల్లో ఎన్నికయ్యారు. ఎంపికైన విద్యార్థులను పలువురు విద్యార్థులు, ఉద్యోగులు అభినందించారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మోతీనగర్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ సబీహా బేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్, గాయత్రి నగర్‌లో మంజు హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాయత్రినగర్‌లోని ఉచిత వైద్య శిబిరాలను అల్లాపూర్ డివిజన్ ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాలుష్యంపై నిరసన గళం



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కాలనీ వాసులు



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న దృశ్యం

నిజాంపేట్: బొల్లారం, కాజీపల్లి, బొంతపల్లి పాశమైలారం, తదితర పరిశ్రామిక వాడల్లో కొనసాగుతున్న రసాయనిక పరిశ్రమల నుంచి నిబంధనలకు విరుద్ధంగా వెలువడుతున్న కాలుష్యంపై కాలనీ వాసులు కథం తొక్కారు. ఆదివారం హరితహారం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బీజేపీ మల్కాజిగిరి కౌన్సిల్ సభ్యులు వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, దుండిగల్ మున్సిపాలిటీ, బొల్లారం మున్సిపాలిటీల్లో నివసిస్తున్న ప్రజల ఆరోగ్య ప్రమాణాలు నానాటికి క్షీణిస్తున్నాయన్నారు. పీసీబీ అధికారులు కాలుష్య కారక పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మార్చి 9న ర్యాలీలు నిర్వహించామని, మార్చి 15న పీసీబీ అధికారులకు ప్రజల సంతకాలతో మెమోరాండం ఇవ్వడం జరిగిందన్నారు. అయితే అధికారులు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చటంలో విఫలమైనందునందుకు నిరసనగా ఆదివారం బాచుపల్లి, మల్లంపేట్ కూడళ్లలో నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పెట్రోలింగ్ ద్వారా గస్తీ నిర్వహిస్తామని, తనిఖీల్లో దొరికిన పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకుంటామని, నిబంధనలకు విరుద్ధంగా కాలుష్యం వెదజల్లుతున్న ఫ్యాక్టరీల జాబితాను విడుదల చేస్తామని చెప్పిన అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రణీత్ లీఫ్, ప్రణీత్ జేమ్స్, భావన జీఎల్‌సి, పీవీఆర్ హిరిస్ మెడోవ్స్, క్రాంతినగర్ కాలనీ, హరితవనం కాలనీ, కెఆర్ సిఆర్ కాలనీ, శ్రీహోమ్స్ కాలనీ, రేణుక ఎల్లమ్మ కాలనీ, నందనవనం కాలనీ, ప్రణీత్ జనిత్, ప్రణీత్ ప్రణవ్ యాంటీలియా, ప్రణీత్ ఎంక్లేవ్, ప్రణీత్ టౌన్ స్క్వేర్, బ్లాక్ డైమండ్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

మిత్ర హిల్స్‌లో వీధి దీపాల సమస్య పరిష్కారం



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

మోతీనగర్: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని మిత్ర హిల్స్ కాలనీలో నెలకొన్న పలు సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆదివారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ సిబ్బంది, కాలనీ వాసులతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా స్థానికులు కాలనీలో వీధి దీపాలు పని చేయటం లేదని దీంతో దొంగతనాలు, కుక్కల బెడద ఎక్కువగా ఉందని చెప్పటంతో తక్షణమే స్పందించి వీధి లైట్లను మార్పించారు. కాలనీ వాసుల నుంచి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. హైదర్‌నగర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు సుధాకర్, కాళి, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు ప్రారంభం



అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను ప్రారంభించిన ప్రసాద్ రాజు

నిజాంపేట్: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం బాచుపల్లి బీజేపీ అధ్యక్షుడు ప్రసాద్ రాజు, దళిత మోర్చా నాయకుల ఆధ్వర్యంలో ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాచుపల్లిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేశారు. ప్రసాద్ రాజు మాట్లాడుతూ ఏప్రిల్ 13 నుంచి 25 వరకు పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భారత రాజ్యాంగ పరిరక్షణ నరేంద్ర మోదీ నాయకత్వంలోని సాధ్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి దాసి నాగరాజు, కార్యవర్గ సభ్యులు గజ్జెల్లి సంతోష్ కుమార్, పార్లమెంట్ మీడియా కన్వీనర్ సుమన్‌రావు, జిల్లా అధికార ప్రతినిధి రచ్చ చక్రధర్ సాయి కృష్ణారెడ్డి, మండల నాయకులు నారాయణ మూర్తి, అశోక్ నాయక్, శివప్రసాద్, దినేష్, బీజేవైఎం అధ్యక్షులు భూపాల్‌రెడ్డి, ఉదయ్ కిరణ్, సురేష్ గోపతి, ప్రహ్లాద్, గణేష్, బైరం పవన్, కార్తీక్, ధన, గోపాల కృష్ణంరాజు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి సందర్భంగా నేడు ర్యాలీ

నిజాంపేట్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం సాయంత్రం ఆలీప్ సర్కిల్ నుంచి ఎన్టీఆర్ పార్క్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రగతి కల్చరల్ అసోసియేషన్, ప్రగతి యూత్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సభ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మోతీనగర్: డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు మూసాపేట డివిజన్ స్నేహపురి కాలనీలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. నాలా పొడవునా స్లాబ్ పనులు పూర్తి అయినందున విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. స్నేహపురి కాలనీ మెయిన్‌రోడ్డుతో పాటు, అంతర్గతంగా ఉన్న రోడ్లకు నాలా స్లాబ్ ఎత్తుగా ఉన్నందున వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని, నాలా స్లాబ్‌తో రోడ్లను అనుసంధానం చేయాలని కోరారు. దీనిపై స్పందిస్తూ సమస్యలను ఎమ్మెల్యే కృష్ణారావు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సి.హెచ్. సత్యనారాయణ, డివిజన్ ప్రధాన కార్యదర్శి తిరుపతి, కాలనీ అధ్యక్షుడు వినోద్, వెంకటేశ్వర్ రెడ్డి, చలమారెడ్డి, రమేష్, మోహన్ రెడ్డి, జేవి. ప్రసాద్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్న బీజేపీ



జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీశైలంగౌడ్

నిజాంపేట్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ, ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ రాజకీయ మనుగడ కోసం విద్వేషాలను రెచ్చగొడుతుందని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పలు వార్డుల్లో జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, కూన శ్రీశైలంగౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సిరెడ్డి భూపతిరెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ వారసత్వాన్ని, డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌ని అవమానించడం అంటే దేశ ప్రజలను అవమానించినట్లేనని అన్నారు. బీజేపీ అసమర్థ పాలనపై ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో బస్తీ నుంచి బజారు వరకు జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. డివిజన్ స్థాయి, మండల స్థాయి, బూత్‌స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాసరెడ్డి, మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, కోలన్ రాజశేఖర్‌రెడ్డి, కోలన్ శ్రీనివాస్‌రెడ్డి, జగదీష్‌యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, సురేంద్ర కుమార్ యాదవ్, అంజాద్, లక్ష్మణ్, శ్రీనివాసరావు యుకిరణ్‌రెడ్డి, నాగిరెడ్డి, సాయికుమార్, వర్మ, మురళి తదితరులు పాల్గొన్నారు.